# వెన్నెల పైట

జ్ఞాన విశ్వం

894.8271
VIS

Dr. B. R. AMBEDKAR
OPEN UNIVERSITY
LIBRARY
HYDERABAD-500 033

# పెన్నేటి పాట

కావ్యం

విద్వాన్ విశ్వం

DR. B.R AMBEDKAR OPEN UNIVERSITY
UNIVERSITY - LIBRARY
N10322

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.
10322

యం. శేషాచలం అండ్ కంపెని,

మచిలీపట్టణము : సికింద్రాబాదు : మద్రాసు-1

PENNETI PAATA (Kaavyam)

*By*

**VIDWAN VISWAM**

First Edition : April, 1956
Reprinted in our series; June, 1974

*Published by :*

M. SESHACHALAM & CO.
Machilipatnam — Secunderabad — Madras

*Printed by* :

HINDU PRESS, MACHILIPATNAM

Price : Rs 3-00

T
894.8271
VIS

Regd. 212864

ఆంధ్ర ప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
వారి 'ఇంటింటా స్వంత గ్రంథాలయం'
ప్రణాళిక చందాదారులకు ప్రత్యేక
ప్రచురణ.

ప్రాప్తిస్థానం:
ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
రాష్ట్రపతి రోడ్డు : సికిందరాబాదు.

AOU-A105B122



అంకితం

నార్లవారికి

"పెన్నేటి పాట" ప్రచురితమై తెనుగు నాడున సహృదయు లందఱను ఎన్నడో అలరించినది. తొలిప్రచురణ ప్రతులు ఎన్నడో అయిపోయినవి.

ఇంత దాకా రెండవ ప్రచురణ కాకపోవడానికి నా అలసతే కారణం. ఇదిలా ఇప్పుడు ప్రచురణ కావడానికి శ్రీ యం. యన్. రావుగారి ఆదరమే కారణం.

తొలిసారివలెనే మలిసారి ఈ కావ్యం తెలుగుల మన్ననలను అందుకో గలదని నమ్ముతున్నాను.

మదరాసు — విశ్వం
1—6—74

రాయలసీమలో పెన్నేటిగట్టున ఉన్న పల్లెల బ్రతుకునీడ ఇందులో కానవస్తుంది. అక్కడి పలుకుబడులూ ఊరు, పేరులూ ఇందులో కనిపిస్తాయి.

ఇది కావ్యం. చరిత్రగానీ, కథగానీ కాదు. కాబట్టే ఏ ఒక్క పల్లెనో ఏ వ్యక్తి జీవితాన్నో ఉద్దేశించి వ్రాసినది కాదు.

# పీఠిక

## శ్రీమాన్ రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ

రాయలసీమ నేడు అఖండాంధ్ర దేశములోని ఒక విశిష్టఖండముగా ఏర్పడియుండుటకు దాని యిప్పటి దరిద్రావస్థ ముఖ్యకారణము. మైసూరు పర్వతాల అధిత్యకా భాగమై, అడుగడుగునను పెద్ద చిన్న కొండలు అడవులు కలిగి, ఎన్నో చిన్న పెద్ద నదుల వెల్లువలచే చల్లఁదనము కొల్ల పంటలు గలిగి, అపారమైన గోధనమును బోషించుచు సర్వసమృద్ధమై యొకానొకప్పు డుండినది. ఎన్నో చిన్నపెద్ద రాజ్యములకు రాజధానులకు చోటిచ్చిన దీ సీమ. పరిగి, హేమావతి, రాయదుర్గము, గుత్తి, పాగొండ, బళ్ళారి, మడకసిర, మధుగిరి మొదలగునవి అట్లుండగా, విజయనగరపు చక్రవర్తులకు వేసవికాలమందలి చలువరాజధానిగా ఎంతో కాల మాశ్రయ మిచ్చిన పెనుగొండ—ఘనగిరి, ఇందలిది. రామరాజభూషణుని నోరూరించిన 'దాడిమలతా లలితాంగు'లు, ఆకాలపు 'జటిల ద్రాక్షాగుళుచ్ఛం బులు' నేడును అక్కడ పుణ్యవంతులు చవిచూడవచ్చును. షష్టిపూర్తి చేసుకొన్న ఆ సీమవా రందరికి అక్కడి ప్రాచీన సమృద్ధిలో కొంతభాగ మైనను చిన్నతనమున అనుభవమునకు వచ్చియుండును. మఱి వారు దానిని మఱువలేరు.

ఆ వైభవపరిశేషము క్రమముగా మావంటివారి కన్నులయెదుటనే అంతర్ధానమైనది. అక్కడి లెక్కలేని చెఱువులలో ఎన్నో తెగిపోయినవి. ఉన్నవి ముప్పాతిక పూడిపోయినవి. మైసూరు రాజ్యమువారు పైనుండి దిగివచ్చు నదులకు వంకలకు చెఱువులు గట్టుకొని ఊట నడ్డగించుటచే నదులకు వాననీరు తప్ప వేఱునీరు లేకపోయినది. 'సరవ' అను పేర అంతర్గామినిగా శాఖోపశాఖలుగా ప్రవహించుచుండిన సరస్వతి వట్టి యిసుకపాతరగా మాఱినది. అందందు సహజముగా ఎగజిమ్ముచుండిన

'తలపరిగలు'—నీటిబుగ్గలు, వట్టిపాయి విడుచుకొని క్రమముగ మన్నుమూసి కొన్నవి. అడవులన్నియు వంటచెఱకులై పొగబాఱిపోయినవి. పశుసంపద కటికవారి పాడై పోయినది. ఇఁక మనుష్యులమాట చెప్పనేల? ఆంగ్లేయుల దొరతనములో ఈ సీమ యెన్నివిధముల ఎండవచ్చునో అన్నివిధములను ఎండినది; ఎండింపఁబడినది. ప్రజల పరవశత, అధికారుల అలక్ష్యము, ఇరుగు పొరుగులవారి స్వార్థపరత, వీనికితోడు దైవము దయదప్పుట, ఇన్నికలిసి నేటి రాయలసీమ రూపుగొన్నది. మఱి తోడి ఆంధ్రులే అధికారము అవకాశము గలిగినప్పుడు గూడ ఈ సీమ యోగక్షేమములను గమనింపలేదు. సరిగదా, మీదుమిక్కిలి ఇది రాళ్ళసీమయని, అరణ్యమని, ఇక్కడివారికి చదువుసంతలు లేవని, వారు అనాగరకులని పరిహాసమును ఆక్షేపమును జేసినవారును కొందరుండిరి, నేడును లేకపోలేదు. ఇది 'క్షతే క్షారమివాసహ్యం' అన్నట్లయినది ఆ సీమలవారికి. ఇది ముఖ్యకారణముగా ఈ ఆంధ్రఖండమునకు 'రాయలసీమ' అని విభిన్ననామమును తాము ఇతరాంధ్రులతో చేరియుండ లేమనుభావము ఇందలి ప్రజలకును గలిగి వ్యాపించినది. ఆంధ్రరాష్ట్రసాధనకు ఇది అడ్డుపడగులునేమోయను తీవ్రభయమును ఉండెడిది. కాని కొందఱు దూరదృష్టిగల మహనీయుల ప్రయత్నముచేత అట్లు జరుగలేదు. మా రాళ్ళపల్లికి సమీపమందలి పేరూరు అను గ్రామమువద్ద మల్పుదిరుగు పెన్నేటినడ్డగించి చెఱువు కట్టవలెనను భావము సర్కారువారికి ఏ మహనీయుడో సుమారు 55 సంవత్సరాలకు ముందు కలిగింపగా, ఆ పని మొన్న మొన్నటిదాకా రూపెత్తలేదని, నేటికివి పూర్తికాలేదని తెలిపికొన్నవారికి ఈసీమ దైన్యమును, దీనివి గమనించిన సహృదయులకుఁ గలుగు నిర్వేదమును కొంత అర్థము కాగలవు.

నామిత్రులు విద్వాన్ శ్రీ విశ్వంగారి అట్టి తీవ్రనిర్వేదమే ఈ పెన్నేటి పాటగా పరిణమించినది. వాల్మీకి తనకుగలిగిన శోకము శ్లోకమయినదని చెప్పుకొన్నాడు. కాని వాల్మీకి మనుష్యత్వపరభాగమైన మహర్షిత్వమును సాధించుకొన్న మహాతపస్వి. కనుక అతని శ్లోకములలో

VIII

మూలమైన శోకము ఎక్కువగా ప్రతిఫలింపలేదు. శాంతి, దాంతి, శౌర్యము, వివేకము, దయ, ధర్మము, వింతలు, వినోదములు, ఇత్యాదిభావములే యెక్కువగానుండి ఆయన రచన ప్రశాంత మధురమైనది. విశ్వంగారిది మానవహృదయము. ఊహకన్న, భావనకన్న అనుభవమే మూలాధారముగా వెడలిన పరవశరచన వీరి 'పాట'. నిర్వేదము తీవ్రమైనప్పుడు అన్ని నియమాలను చెల్లాచెదరుచేయు వేసటగా పనిచేయును. అది యీ 'పాట' లో కవిగారిని ఎన్నో ఆటలాడించినది.

ఈ దేశమునందలి ప్రాచీనవైభవము అంతయు ఒక దృశ్యముగా కన్నులకు దట్టి ఈ కావ్యతాండవమునకు నాందిగా ఒక సీసము ఒక గీతము మెఱుపు దీగవలె మిఱుమిట్లు గొల్పుచు కవిగారి కలమున మెఱసిపోయినది. ఉత్తరక్షణమందే.

> "కోటిగొంతుల కిన్నెర మీటికొనుచు
> కోటిగుండెల కంజరి కొట్టుకొనుచు"

'నేఁటి రాయలసీమ కన్నీటిపాట' స్వచ్ఛందవృత్తముతో వెలువడినది. అందు ప్రతిఫలించినది 'పీనుగులపెన్న', 'వట్టియెడారి', 'నక్కబావలు', 'నాగుబాములు,' 'బొంతగద్దలు', 'రేణగంపలు, పల్లేరుగాయలు, తుమ్మతోపులు', ఇత్యాది అసంఖ్యసామగ్రితో విశ్వంగారి కవితా విరూపాక్షుడు తాండవించినాడు; భాష, అర్థము, భావము, ఛందస్సు అన్నియు ఆ తాండవమునకు ప్రక్కవాద్యాలు వాయించినవి. 'పిన్పాట' పాడినవి: ఒక మాటలో, ఒక చేయూపులో, ఒక తలయాడింపులో, ఒక తిరుపులో ఈ నటరాజు రాయలసీమలోని భూతభవజ్జీవితమునందలి చిన్నపెద్ద ఖండికలెన్నో విసరివైచినాడు.

ఈ దృష్టికి—ఈ సృష్టికి కథ యనావశ్యకము. అసాధ్యముగూడ. రంగడు ఒక పెద్ద రైతుకు ఏకపుత్రుడు. ఆ తండ్రి 'పెగ్గిలు' బ్రతుకులో

కొడుకుకు మిగిలిన ఆస్తిపాస్తు లన్నియు వాని శరీరమొకటే. వాని చిన్న యిల్లాలు గంగమ్మ. ఆ 'గంతకు తగిన బొంత', కాని ఆ రెంటిలోను ఎంతో ఒద్దిక, మార్దవము, సామరస్యము గలదు. ఇద్దఱికిని ఆయిద్దఱు తప్ప వెనుకముందుల వా రెవరును లేరు. గడ్డియో, కట్టెలో దొరకినది అడవినుండి మోపుగట్టుకొనివచ్చి వచ్చినంత కమ్ముకొను కూలిపని రంగనిది. ఇరుగుపొరుగువారింట వడ్లో, అటుకులో దంచి నూకలో తవుడో తెచ్చుకొను కూలిపని గంగమ్మది. ఈ యిద్దరి పరస్పరప్రేమ, పరోపకారబుద్ధి, కపుడులేని నడత, అంతులేని దారిద్ర్యము, విసుగుకొనుటకును వీలులేని కాయకష్టము, ఇరుగుపొరుగువారి నిస్సహాయత, చేతనైన వారి యుదాసీనత, ఈనడుమ గంగమ్మ గర్భము, దోహదము విశ్రాంతి లేక ఆ పిల్ల పడు కష్టములను చూచి చేయున దేమియులేక రంగడు 'సమాధిగతుండగు యోగిబోలె స్తబ్ధుడై యుండుట—వారి భవిష్యత్తును గూర్చి పెద్దగా ధ్వనించు ప్రశ్న — ఇదే ఇందలి వస్తువు. కడపట

'హృదయమా! మానవుడు నిన్ బహిష్కరించె!'
'చచ్చె నీ లోకమున మనస్సాక్షి యనుచు
నెత్తి నోరిడి కొట్టుకోవిందు నన్ను!'

అని భరతవాక్యము పాడినారు కవిగారు!

కాని ఇంతనిస్సహాయమైన నిర్వేదమునందును కావ్యపు కమనీయత యెంతో యున్నది. దానికి ఆ పెన్నేటి 'నీటిలో కమ్మదనము లూరుచుండును' అను అంతస్తత్వమును కవిగారు మఱవకుండుటయే కారణము.

"గుండె జలదరింపజేయు రండతనము డుల్చివేయు
ఖండితవాదిని జేయును దండితల్లి సుమ్మీ నది!"

"నిండుమనసు నిజాయితీ - దండిచేయి ధర్మదీక్ష
పండువయసు పట్టుదలా - పండించును గుండెలలో."

అను నమ్మకము వీరి కావ్య కామనీయకబలమునకు చేయూత. ఇతర సీమలవారికీ గుణములు ఎంతవఱకు ఉన్నవి. ఆదేశాలలో దరిద్రదేవత ఏయేరీతులలో తాండవించుచున్నది. అను చింత, చర్చ, ప్రకృతవిషయము కాదు. పైగుణములు రాయలసీమవారి కేమాత్రముండినను వారు మరల చేతరించుకోగలరు. 'సమానానా ముత్తమశ్లోకో అస్తు' అను వైదిక మంగ ళాశంస యెట్లున్నను 'సమానానాం సమాన శ్లోకో అస్తు' అనుకోగలిగిరేని రాయలసీమవాసులు ఎవరికిని తలవంచ బనిలేదు. ఆ నారు పైరగు కాలము వచ్చినది. పంటగూడ ఎంతో దూరమున లేదు.

శ్రీ విశ్వంగారి వివిధ విస్తృత వాఙ్మయసేవను చవిచూచుచున్న తెలుగువారు ఈ చిన్నకావ్యమునందలి పెద్ద హృదయమునకు తప్పక స్వాగతమిత్తురు.

# మొదటి సర్గ

కలమ పాలికల యాలల మేలి పాటల
  జుమ్మని మ్రోయు మించుల సితారు;
తెనుగు పెద్దన్నల గొనబు పల్కుల, గుబా
  ళించిన జాజి మల్లెల గుడారు:
జిలుగు జరీబుటా వలువ సింగారింపు
  మెలకువ లూర్చు నిగ్గుల కొఠారు;
తలకు మించిన సత్యముల లోతులను జీల్చు
  చును వోవు తెల్వి యంచుల కఠారు;

కడిది మొనగాని
  ఎడద చిక్కనకు పేరు;
కటిక ఠాలను కవ్వించి,
  గజ్జకట్టి,
చిందు ద్రొక్కించు
  మాయల జిలుగు తేరు
కలదు
  రాయలసీమ పచ్చల బజారు.

అచట నొకనాడు పండె
ముత్యాల చాలు;
అట నొకప్పుడు నిండె
కావ్యాల జాలు;
అచ్చట నొకపుడు కురిసె
భాష్యాల జల్లు;
విరిసె నట నాడు
వేయంచు విచ్చుకత్తి.

ఇది గతించిన కథ;
వినిపింతు నింక
నేటి రాయలసీమ
కన్నీటి పాట
కోటి గొంతుల
కిన్నెర మీటుకొనుచు
కోటి గుండెల
కంజరి కొట్టుకొనుచు.

అదే పెన్న! అదే పెన్న!
నిదానించి నడు!
విదారించు నెదన్, వట్టి
ఎడారి తమ్ముడు!

ఎదీ పెన్న ? ఎదీ పెన్న ?
ఎదీ పినాకినీ ?
ఇదే పెన్న! ఇదే పెన్న!
ఇదే పినాకిని !

ఎదీ నీరు ? ఎదీ హోరు ?
ఎదీ నీటి జాలు ?
ఇదే నీరు ! ఇదే హోరు !
ఇదే ఇసుక వాలు !

అదే పెన్న ! అదే పెన్న !
నిదానించి నడు !
నిదారించు నెదన్, వట్టి
ఎడారి తమ్ముడు !

పార చేబట్టుకొని
వంగి చీరు దనుక,
ఇట్టె చెమ్మట
కాలువ గట్టు దనుక,
ఇసుక పాతర లోతుల
కేగు దనుక,
నీకు కన్పించ దీయేటి
నీటిచుక్క !

కుండపోతల వానలు
గుఱియ నేమి ?
పట్టుమని పదినాళ్ళలో
పారబోసి,
ఇసుక బొక్కసమున
మిగులెల్ల దాచి,
పెన్న పడుకొను
నీ నేల దిన్నెమీద !

చిటపట వానలకే, ఒ
క్కట నోరుం దెఱచి, నురుగు గ్రక్కుకొనుచు, ను
త్కటమై, దరు లొఱసి, రటత్
కటు ప్రవాహముల నింగికై పరువెత్తుఁ.

జఠర లుఠ ఝ్ఝుషమై, క
ర్మఠులై దరిజేగు జీవరాశుల మ్రింగున్ ;
హఠ మెంతని! ఇది చేయని
హఠాత్ కఠోర క్రియా విహారము కలదా !

కాని, ఈ ఏటి నీటిలో
కమ్మదనము లూరుచుండును ;
దోసిట నొక్కమారు
పుక్కిలించిన జాలు
నీ పుట్టువునకు,
సార్థకత్వమ్ము
నిష్కల్మషత్వ మబ్బు !

గుండె జలదరింప జేయు ;
రండతనము దుల్చి వేయు,
ఖండిత వాదిని జేయును
దండి తల్లి సుబ్మ్మా నది !

కండలేక ఎండిపోయి
బెండు వారినా సరే !
తిండిలేక, తుండులేక
పండవారినా సరే !
నిండు మనసు, నిజాయితీ,
పండు వయసు. పట్టుదలా,
దండిచేయి, ధర్మదీక్ష
పండించును గుండెలలో.

రండు రండు! చేతు లెత్తి
దండము తల్లీ యని, కై
దండల దండలతో, నీ
రెండ నిలిచి కొలిచి పొండు!

ఇంత మంచి పెన్నతల్లి
ఎందు కెండి పోయెనో?
ఇంతమంది కన్నతల్లి
ఎందు కిట్లు మారెనో?

వంతలతో, చింతలతో
కంతలువడి పోయెన్నో!
సంతుకోస మేడ్చి యేడ్చి,
గొంతు కారిపోయెనో!

ఇంత మంచి పెన్నతల్లి
ఎందు కిట్లు మారెనో?
ఇంత మంది కన్నతల్లి
ఎందు కెండి పోయెనో?

ఈ యేటి కాల్వ లోతుల
పాయలుగా పారు, నీటి ప్రతి బొట్టున, నీ
చాయల రైతుల నెత్తుటి
చాయలు సమ్మిళితమె విచారము గొల్పున్.

ఈ యేటి దరుల దిన్నెల
పాయక దిరుగాడు నక్క బావలె యెపుడున్ ;
వేయారు పీన్గు లిచ్చట
నే యంత్యక్రియల బొందు నెప్పటి కపుడే.

సుర గరుడోరగ విద్యా
ధర కిన్నర సిద్ధ సాధ్య దైవత తరుణీ
చరణారుణ పంకేరుహ
వర రేఖలు లేవు; వట్టి వఱదులె తిరుగున్ .

నాగ కన్యక లిచట
        కన్పడరు గాని,
నాగుబాములు చక చక
        సాగు నిచట ;
గరుడ గంధర్వ కామినుల్
        కానబడరు గాని,
బొంత గద్దలు
        గుంపుగట్టు, నిచట !

ఏలాలతాజాల డోలిక లిట లేవు
        తిప్పతీగెల తలతిక్క గాని ,
తరుణ ప్రవాళ లతా కుంజములు లేవు,
        రేణగంపల పొదరిండ్లెగాని ;

లలి లవంగ కుడుంగ లాలిత్యములు లేవు,
     తుమ్మతోపుల ముండ్లదోరులె గాని ;
నారికేళాది వనాంతరస్థలి లేదు,
     చిట్టీత డొంకల చేలెగాని—

ఇట గులాబీలు
     తలసూప వెపుడు ; వట్టి
తంగెడుల్ బోదగడ్డి గాదములె
     పెరుగు ;
సరస సుకుమార తృణ
     సమాచ్ఛదము లేదు,
పాడు పల్లెరుగాయల
     బీడెగాని !

శుక పిక శారికా రవ
     రుచుల్ వినిపింపవు ; గూబమూల్గు, లో
కొ్క కతతి గుండె ఫీల్చును ;
     దిగుల్ వడ జేయును తీతువుల్ ; సము
త్సుక వృక జంబుకమ్ములు
     మతుల్ సెడ గుయ్యిడు ; వల్ల కాడు పె
న్నుకు నిరుగట్టులందు
     పులినస్థలి పుట్టెలు పండు మెండుగన్.

బల్లులు, తొండలు, నెలుకలు,
పిల్లులు కుక్కలును, చెవుల పిల్లులు కొల్లల్ ;
కొల్లలు తేళ్ళుం జెఱ్ఱులు—
ఇల్లూ వాకిలి యిదే ఫణీంద్రుల కెల్లన్.

పుట్టలు గుట్టలు గుట్టలు ;
పట్టెడు పట్టెడు నిజమ్ము పాపర కాయల్
పుట్టెడు పుట్టెడు జులుకులు—
కట్టా ! ఇది యేటి మేటిగట్టు తమ్ముడా !

నిటారిళ్ళకు చెట్రాళ్ళకు
బేట్రాళ్ళకు కొదువ లేదు ; బిసబిస నడువన్
కుట్రెళ్ళి వచ్చు, నీ తల
పేట్రేగును సుమ్ము ముందు వెనుకల్ గనుమా !

ఆ చింత చెట్టు కొమ్మే - చిన్నిగాని యూ
పిరి దీసివేసిన యూరికె బారిపు;
ఆ తుమ్మ చెట్టు దిమ్మే - సీతిగాని కా
ళను జేర వేసిన బాలుగాయ ;
ఆ యీత చెట్టు పట్టే - యెంకి కడియాల
నూడ్చిన తీర్పులో నొక్క సాక్షి ;
ఆ బోదపోచ రెమ్మే - బుఱ్ఱ ఎరుకల
సాని చండా లూడ్పుజాలు జాణ

ఆ యిసుక దిబ్బయే—
చలమన్న బండి బడక
నమ్మించినట్టి ముక్కిడి కసాయి—
అక్కటక్కట ! ఇక్కడ అడుగు దీసి
అడుగు బెట్టుటకే
గుండె లవిసిపోవు.

విడుగుచుండె తిమిర మదే
తొడుగుచుండె నరుణకాంతి
తడబడ పనిలే దిక అ
క్కడ నేదో కోడికూత ?

వడి వడిగా నడు ! నడు !! క
న్పడు నేదో పల్లె యొకటి—
విడుగుచుండె తిమిర మదే
తొడుగుచుండె నరుణకాంతి.

అటు నిటు కల్లకంప
తరుణారుణ దీప్తులు దూరనేర విచ్చుట !
నడుమన్ గలట్టిది విశాల మహాధ్వము
మూడు మూళ్ళు ;

చిక్కటి యిసుకన్ పదమ్ములు
కకావికలై చను;
నీడ్వలేక ఎంతటి బిగిగిత్తలైన
దగ తల్లడిలున్ — మన మింక లెక్కయా?
ఈ డొంక - పెండ్లిండ్ల కేగు వారల
నెన్ని తూరులు దొంగలు దోచుకొనిరో?
ఈ డొంక - నిండు బండ్లెన్ని మారులు
బరువెక్కుట యిరుసు పుటుక్కు- మనెనో?
ఈ డొంక - నెన్ని సార్లెందరు మొనగాండ్ల
కాలుసేతుల యెముకలు విఱిగెనో!
ఈ డొంక - మంచినీళ్లెత్తుకవచ్చు
కొంగ్రొత్త కోడం డ్రెంత కుళ్ళుకొనిరో!
ఇచట మునిమాపు లం దెన్ని యెన్ని
మోజుకతలలో రసపట్టులు కాటువడెనో!
ఇచట నెండప్రొద్దుల పసు లెన్ని యెన్ని
ఇంత విశ్రాంతికై
తపియించినవియొ!
ఇది విడిది ఆలమందకు,
నిదియే గొఱ్ఱెలకు తావు, నింక మేకలన్
గదుముక వత్తు రిచటికే,
ఇది పులులకు రేవు నీటి యెద్దడి యయినన్.

వంక యిదియె
కొండ వాగుతో నేర్పడె!
వాన వచ్చినపుడు
వంక పాఱు ;
దీని లోన
ప్రక్కగా నున్నదే కాల్వ ,
బాట దరిని
మంచినీటి చెలమ !

అదిగో! పారల నెత్తిపట్టుకొని
వేయార్మంది, యీ కాల్వనే
పదిలంబుం బొనరింప వత్తు ;
రిది కుప్పల్ గొట్టు కాలమ్మువాక
దినమ్మున్ బ్రతిరైతు సేయవలె :
సర్కారూరకే పన్ను వేయుదు రంటే—
ఒకనాడు మానిన
పాలా లుత్తుత్తవై పోయెడిన్.

ఆ గుంపులోన వచ్చుచు
రాగమ్మున యాలపాడు రంగన్న కదే
యాగము, యోగము, భోగము,
రోగమ్మునుగూడ నిదియె
రోజులు గడవన్.

ఇది మొదటివర్గ

రెండవ సర్గ

రంగనికి గలట్టి
బ్రదుకుటాదరువు 'యఱ్ఱోని చేను' పాలు
రొంపి రొచ్చు;
ఉన్న దొక్క యెకర మూంపిరి దీయును,
కాల్వ త్రొవ్వ కమ్మె
కండ లూడ్చు.

ఒకనా డతని నాన్న
ఊరిలో పెద్ద సంసారి;
నాలుగు కాండ్ల సాగుబడిని సేయు
పట్టాదారు;
వేయూరు రైతుల కి స్త్రీల క స్త్రీల,
కేలు సాపి ఆదుకొనుచు
మంచి యనిపించు కొన్నాడు;
పేదసాదల కింత పెట్టినాడు;
ఊరి దేవళమున
కొక నెల కొక రోజు పూజ కిచ్చి
పెద్ద పుణ్యవంతు డనుచు
తంబళ్ల సుబ్బమ్మ దినదినమ్ము
నొప్పుకొనుచుండు;

దాసరి ఓబిలేసు—
గరుడ గంబమ్ములో
వెండికాసు వేయు పరమ భాగవతుం డని
పాడు నతని.

గుడిసె ముందట నీడలో గూరుచుండి,
అలతి యీతాకు చాపల నల్లుకొనుచు,
దొంగ సుంకన్న తిరణాల తోదులోన
పాటగట్టె నీయనపయి మేటి యనుచు.

"సై సై నారపరెడ్డి నీ
పేరే బంగరు కడ్డిరా॥
పారబోస్తివి దాన్యమంతా
ఊరడిస్తివి పేదవోళ్ళను
కోరమీసం మెలీపెడితే
సీరాముడు నీవే నయ్యా॥
అంతపూరం శాటలోనా
చింతలపల్లె చెఱువుమీనా
పంత మేసీ బండిదోల్తే
పటుకలాసనె కలెకటేరూ॥

పప్పాపూ ఆసీవెర్తం
పరషలో కోలన్నగాళ్లు

పాడుతాంటే సంచి రూకలు
పారేస్తివి బట్టమీాదా ॥సై సై॥"

అది పల్లెపాట నె
మ్మదిలోని మాట;
మొద లుండునే కాని
తుదలేని బాట;
పదినోళ్ళలో పడి
పదిరూపు లెత్తి,
కదలి పోయెడు కైత
కమ్మని యూట.

బట్ట లచ్చుమయ్య, బండారు బసవయ్య
పంచ రత్నములను బట్టిపెట్టి
ఊరి సుంకులమ్మ
తేరునా, డీయన
సన్నిధానమందు చదివినారు.

"శ్రీ సుంకులాంబ నీ కే
గాసియు రాకుండ జూచి గ్రమ్మఱి బ్రోచున్
భాసుర కీర్తి పతాకా
ధూసరితాజాండకుండ దోర్బలశుండా!

పాకారి ప్రభృతులలో
శోకారి యటంచు పేరు సొగసుగ గను, నా
కాకాసుర సంహారి, ని
రాకృత దుష్టారి బ్రోచురా నారప్పన్.

ఇంద్రుడ వీవె చంద్రుడవు
నీవె యటం చని మాదు డెందముల్
సందడి సేయుచుండె నర
సన్న కుమారుడ, నారపాఖ్య! నిం
బొందిన మా పురీ విభవ
పూర్ణత నెంచగ నాదిశేషుడున్
తొందరవోవు! ప త్తికుల
దుగ్ధ పయోధి సుధాకరా! వరా!

ఇల్లాలు నీకు రామమ—
చెల్లెలు నాగన్న రెడ్డి సింహునకున్; నీ
వల్లుడవు దుబ్బిరెడ్డికి
ఫుల్లాంభోజాత నేత్ర! పూతచరిత్రా!

ఎద్దుల బండి నెక్కి, పయ
నించుచు నుండగ ధూళి రేగి, ఆ
ప్రొద్దును మూసివేయగనె
పో సురవైరులు లేచి వచ్చి, రా

యెద్దుల తోకలం గలుగు
నింతటి మారుతమంత వీచినన్
దద్దయు ప్రొద్దుదోచె - పిశి
తాశను లంతట పారిపోవరే! ”

ఈ పంచరత్నముల విని,
కోపమ్మున మొగము ద్రిప్పుకొనె పురోహితుం;
డీపాటి చాల్ సెబా సనె
పాపయ్య తనొక్క పెద్ద పండితు డనుచున్.

రూకల సంచి దీసి, పెద రుద్రయ బిల్చి
పదార్ పదాలుగా
ఆకవు లొక్క రొక్కరికి
నప్పణ పెట్టు మటంచు రెడ్డిగా
రే కరమందు నుంచి, యొనరించిరి
గారవ, మంతతోనె, చా
మీకర భూష లిచ్చినటు
మేనులు పొంగి నుతించి రందరున్.

ఇన్ని పొగడ్తల నా నర
సన్నకొడుకు పెద్ద పేరు సంపాదించెన్,
కొన్ని దినాలకు దస్త్రము
సన్నవడం జొచ్చె, కీర్తిసంపద బలిసెన్.

సర్కారు సిబ్బంది సరిజేయుటకు కొంత
    సాలు జమాబంది పాలు కొంత ;
పారుగూరి మన్నీల సరఫరా కింత
    ఆలేకార్ల లంచాలలోకి కొంత ;
పేట పెద్ద వకీలు పిల్లెకు కొంత,
    కాంపౌండరు మునుసామి పాలు కొంత ;
కోడె రెడ్లకు కొంత, గుఱ్ఱాలకై కొంత
    బగ్గిలకై కొంత, భటుల కింత;

పెద్ద మహడీలు కట్టిన పేర కొంత.
పూటపడి అచ్చవలసిన పాలు కొంత,
తన వివాహాలు నాల్గింటికిని మఱింత
కొంత కొంతయె ఖర్చు కొండంత యయ్యె.

ఎదిగిన కూతు లిద్దఱకు
    నెన్మిది రోజుల పెండ్లి సేతకే
వదలెను వేలు వేలు ; నిరు
    వాగుల వచ్చిన పెండ్లి బండ్లతో
కదలెను ధాన్యలక్ష్మి ; కడ
    కాకియునుం దినె నేతి వంటకా ;
లది గది పెద్ద పెండ్లి యని
    నారు జనా, లది చాలు రెడ్డికిన్ .

ఒక పెండ్లాము గతించె దూమున ; మఱిం
కో భార్య కాల్జాఱి కొ
ట్టుకపోయెన్ పెదవంకలో ; మఱొక
బోట్లుం గట్టగా నామె, యిం
చుక సంసారము జేసి. కూతు గని,
రెండోసారి కాన్పుం గమిం
చకపోయెన్, సరికొత్త రామమయె
వేసారంగ పుత్రుఁ గనెఁ.

వాఁడీ రంగఁడు, పుట్టిన
వాఁడు ముసలి మూఁప్పునందు, వాని తల్లియుఁ
దూడ వయస్సుదె కద, మఱి
నాఁడేమో వణకుచుండె నారప్పాకడే!

రొక్కము లేక, దర్పము
తఱుంగక, నారపరెడ్డి రూకలుఁ
గుక్కను గొట్టరాలు నను
కూతలు విస్మరియించగాక, ఈ
చిక్కుల నేమి దోచక,
వశిత్వము చాలక, చుట్టుజేరి కు
మ్మక్కొనరించు నాశ్రితుల
మాటలకుఁ జెవి జాల వేసినన్.

మఱునాడే పొరుగూరికి
బిరాన తన తలారి వెళ్ళి పెద్దిరెడ్డికిన్
'యరమంచికయ్య' ఆయక
మిరికించిన పత్ర మిచ్చి ఏదో తెచ్చెన్.

ఇక మొదలయ్యె, రెడ్డి
  గడియించిన ఆస్తికి కత్తరింపు. లో
క్కొక మహాసూలు నన్ ఫలము
  కూడ ఒకించుక కమ్మి యయ్యె. నిం
చుక ధరలుం బడెన్, వఱపు
  సూపెను, వానలు బిగ్గబట్టె, నె
ట్లిక సవరించ నేర్చు, ఋణ
  మింతకు నంతకు మిద్దె లెక్కగన్.

చదలంటు వాములు చదు నయిపోయె,
  గాదెల కణజాల గబ్బిలము జేరె ;
నాగలోకము దాకునట్టి పాతరలలో
  ముగ్గిన గింజలు తగ్గిపోయె;
కట్ట గట్టుక నిప్పపెట్టె నింకుగనున్న
  పత్రాల దస్త్రాలు పారిపోయె ;

ఏ కుండలో జూచినా కానవచ్చు.
బంగరు నగానట్ర అక్కలల కేగ
ఒక్కటే రోజు
మూడు రూప్యముల మణుగు

వేరుసెనగ నాలుగణాల
వెలకు తగ్గె;
ఒక్క రూకకే యిరువదియొక్క సేర్ల
కొఱ్ఱలును జొన్నలును
అమ్ముకొనగ వలసె.

పెద్దిరెడ్డి ఒకొక్కటే
పద్దు వేసి,
ప త్తి నారప్పచేలన్ని
క త్తరించె;
అంటు మిద్దెలు నాల్గు
కృష్ణార్పణమ్మె
కాగ - పసులు జీవా లెద్దు
లాగగలవె?

ఊరచావడిని చేరిరి బాకీ
దారు లందరును
తమ రొక్కమునకు;

ఊరిపెద్ద లీమారు పూ ర్తిగా
తీరుమానమే
తేలిచి చెప్పిరి.
తాడూ తలుగూ
కాడీ మేడీ
పారా పలుగూ
కాఙూ కంపా
చెట్టూ చేనూ
చేరి సమ స్తము
కట్టివేసినా
కట కట యయ్యెను.

ఎట్టి ఏగానియే గాని
యివ్వనవక,
నల్లపూసలతో
ఆ స్త్రినెల్ల జూపి
కట్టె వడ్డీ మొదల్
కడ బొట్టు వఱకు—
ప త్తి నారపరెడ్డి
నిబద్దిమనిషి.

ఏరు జెప్పిరో మఱి
తెల్లవారు సరికె—
ప త్తి నారపరెడ్డి దివాల - యనుచు
పసుల పిల్లలు గూడ
దివాల రెడ్డి
అనగ ఊరెల్ల
గప్పున నందుకొనిరె.

ఈ మాట విన్నతోడనె
రామమ్మ భరించలేక, రామాయనుచుర్ణ
ఆమూల చీరె చెఱగు త
నే ముట్టించుకొని కన్యకే యయి పోయెన్.

నారపరెడ్డీ నారప్పయ్యేను
ఊరి మోతుబరి ఉప్పరి యయ్యేను
దారిమోటులో పూరికొట్టమున
చేరెను
తోడ్పాక చిన్నరంగడే.

కుళ్ళి కుళ్ళి యేడ్చి
కుక్కి మంచమునుండి
లేక లేక,
చేయూ చేవలేక.

చిన్నిరంగడిచ్చు
    చిన్నలోటా నీళ్లు,
త్రాగి, ముసలి రెడ్డి
    సాగిపోయె.

తల్లి దండ్రి లేని.
    తనవారెవరు లేని
చిన్నవాని గతిని
    విన్న గూడ
బంధుమిత్ర కోటి
    పదరనైనను లేదు—
సాయపడుట కింక
    కాయ మొకటె.

వాడే రాంగాడయ్యెను
పాడా కసవులను దీసి, పసులగాసి, కూ
లోడా యనిపించు కొనెన్
లేడా నారప్ప వీని లేమిడి చూడన్.

ఎన్ని బడబాగ్నులా చిన్ని యెడద
రగులు చున్నవో?
ఎన్ని కార్చిచ్చు లున్న యవియె?

ఎన్ని సంవత్సర ఝంఝల కెదురు నిలిచి
వాడి వత్తయి పోయెనో
వాని బ్రతుకు !

ఒకరింటి గాటిలో నూరిన గంజెల్ల
నెత్తిపోయుట కెంత యేడ్చినాడో !
ఒకరింటి దొడ్డిలో నుండిన కసవెల్ల
నూడ్చివేయుట కెంత ఉడికినాడో !
ఒకరింటి నట్టింట నున్న కొట్టిలనెల్ల
దంచుట కెంత కంపించినాడో !

ఒకరింట గంపలకున్న రాగులనెల్ల
విసరుట కెంతగా విసివినాడో !
ఒకరి యింటిలో
పిల్లల నూచుటకు,
మరొక్కరింట
పక్కలు వేయు,
నొక్కరింట
అరవచాకిరీ
చేయుట కొఱకు—
ఎంత యెంత దురపిల్లెనో
వాని యింత మెడద !

కటిక కారము సంగటి
గుటక వడక
ఎన్ని బిందెల నీళ్ళు
త్రావించినదియో !
ఎండు రొట్టె ముక్కలు
అఱిగింపుగాక
ఎన్ని మిరప గింజల
నమిలించినదియో ?

ఇవియుం దొరకక పుడిసెడు
గవినీళ్ళం ద్రావి ముడుచుక పరుండిన పా
డు విభావరు లెన్నో, లె
క్కవి లేవరి యేది ? వల్లకాటి మనుగడ౯.

రంగడు—

తొలికోడి కూత క
న్నులు నులుముకొనును !
పిలిపించగానె, చె
ప్పులు తొడుగుకొనును ;
గల గంట్రమోత చే
తుల మొత్తుకొనును—

వెలుగెక్కగానె పం
టలు చూచుకొనును;
మలి సంజలోన కం
డలు తడుపుకొనును।
చలి పెట్టగానె ప్ర
క్కలు దాచుకొనును;
నెల ఎక్కగానె గ
జ్జలు కట్టుకొనును
కల కంఠ మెత్త కో
యిల లూడి పడును—
కల మెఱుంగడు గాని వలపుతుంపురుల
నిలువెత్తుపోసి చిన్నెలు సూపగలడు
బళిబళీ రంగన్న
గళమె కావ్యమ్ము.

'కోలుకో' లని కోలగొట్టిన జాలు
జాలువాఱును 'భరతా'లు వేలు;
'ఓ—' యంచు నొక యూల సాయించితే చాలు
జాఱు 'గాథాసప్తశతు'ల శతులు;

'మచ్చుదిగవే' యన్న మరులు పాటయె చాలు
పొదుగు సేపును-'అష్టపదుల' పదులు ;
'గరుడగమనా' యరచు గాత్రమెత్తిన చాలు
పొంచిచూచును 'మూక పంచశతులు'—
వేలవేల పదాల
పామేల వలయు

ఖంగుమనగల గుండె చిక్కనయెయున్న—
వేయిరూకల మాణిక్య వీణయేల?
వెదురు చాలదె
పలికించు పదిలమున్న?

పుట్టుకవి, గాయకుడు,
నటరాట్టు నతడు—
కట్ట తెగగొట్టుకొని
రస ముట్టిపడగ
ఉట్టిపాటున
కన్నీరు లుగలి పొరల
చెట్టు పుట్టలకే
గుండె పుట్టజేయు.

ఆ రంగన్నే కాలువత్రవ్వకానికి పోతూయాల పాడుతున్నాడు.

వాని తియ్యని గొంతుకలోన లోన
తీవ సాగుచు నన్ను దుద్వేగ రవము :
వాని చిక్కని గుండియ లోన లోన
పూవు పూయుచు నున్న దుద్బుద్ధ రసము.

వేకువ రేకు
లొక్కొక్కటి విచ్చుచు నున్నవి ;
వేప కొమ్మలన్
కాకులగుంపు లొక్కొక్కటిగా
తొలిమున్కల కేగుచున్నవి ;
ఆ కోకిల ఒక్కటే—
గుబురు కొమ్మల రెమ్మల వీడ లేక
కూకూ కుహూ అంచు
నొక్కొక్కటల గూయుచు నున్నది
తెల్లవారగన్.

ఆ పరిశాంత ప్రభాత
సంయాతమంద
మంద మరుదంకురముల
మైమఱచి సొక్కి,

కలతలన్నిటి మఱచి
        రంగన్న
కంఠమెత్తి పరిసర ప్రకృతి
        మంత్రించి లేపె.

ఆ క్షణమ్మున,
        గాన లయామృతమున
లీనమై పోయి
        ప్రకృతికి - మానవులకు
నడుమ నున్నట్టి
        యవనిక ముడిచివేసి
మధుర నిర్మల
        పరమ సమాధి నిలిచె.

జీవితమ్మున
నట్టి రసావబోధ సిద్ధి
ఎన్నడోగాని వాసించబోదు !
వేయి యుగముల
సాధనవిధు లవెల్ల
అట్టి త్రుటికోసమే
తప మ్మాచరించు.

అటుమీఁదట నందఱు, మి
క్కుటమగు సంతసము గుండె గూడుగట్ట, ని
ట్టటు కదలక నిలుచుండిరి ;
తటాలుమని "పిన్న పెద్ద" దరిసెనమయ్యెన్.

సరి ! పిమ్మట మామూలే !
చరచర పారలను బట్టి సాలు మేఱ, కా
ల్వ రమారమి మైలున్నర
వఱకుం ద్రవ్వకము రోజువారి రివాజే.

అంబటి ప్రొద్దు కాగనె
రవంత విరామము గూడ లేక, వా
రుం బరువెత్తి రింటికయి
రొప్పుచు రోజుచు, నంగకమ్ము లె
ల్లం బులకాపుజేసి నటులన్
జెమటల్ జెమఱింప, ప్రేవులన్
దంబుర మోఁత మ్రోయ
నిరత శ్రమదగ్ధు లుదాత్త జీవనుల్.

ఇది రెండవ సర్గ

రంగన్న గబగబా పా
రం గడగా ద్రోసి మొగ, మురమ్ముం, గాళ్ళన్,
ముంగల చేతులు కడుగుకో
నెం గంగను దెచ్చి యిచ్చు నీటి ముంతతో.

కుండలోని సంగటి నంత గోకితీసి,
మూకటిని బెట్టి,
మజ్జిగ మునూగ బోసి,
పచ్చిమెరపకాయొక్కటి తెచ్చి యిచ్చె—
ఉదయ భోజన మతని
కియ్యదియె సుమ్మీ.

గంగమ్మ పదారేండ్లది
కొంగు నిలుచునంత వయసుగూడ లేని, దా
సింగారపు బొమ్మే మన
రంగన్నకు బ్రతుకులో చిరత్న రత్నమా.

అంగమ్ముల నిగనిగ, సా
రంగమ్ముల లగువు బిగువు రంగుల సొగసుల్
ఖంగున మ్రోగెడు కంఠము
బంగరు బొంగరము పుణికి పట్టిన దపుడే.

రంగు వెలిసిన నీలిచీర చె
ఆంగులకు సౌరుంగడించి, తు
రంగలించు కురంగనయనా
స్నిగ్ధ వర్తనముల్ ;
చెంగు చెంగున చెంగలించి, బె
డంగు సొబగుల రంగలించి, వి
హంగ భంగుల వింగడించు—ల
తాంగి చందమ్ముల్.

సిల్వరు కడియాలే ఆ
చెల్వకు సొగసులనుగూర్చ-
చెవుల బెండు గ
మ్మ ల్వయ్యారము బెనిచె, న
గల్వలెనే మిసిమి పసిమి
కలకలలాడన్.

చెండుమల్లె చాలు
నిండుదనమ్మిచ్చు
కొండగోగుచాలు
దండి దండి !

వెండి విళ్ళచాలు
    వెలుగుల విరియించు
కొప్పులోనె గలదు —
    గొప్పదనము.

తిప్పలెన్ని పడిన,
    ముప్పుల మున్గిన
ఉప్పు పప్పు లేని యునికియైన,
కప్పురంపు టెడద
    కమ్మని తలపులు
నిప్పువంటి బ్రదుకు
    గొప్పనిచ్చె.

అమ్మ లేదు,
    నాన్న అంతకంటెను లేదు;
కొమ్మ లేదు, పట్టు గొమ్మ లేదు;
నిమ్మళముగ నెట్లొ
    నెగడించె జీవిక
సొమ్మసిలక
    బాప జూచువఱకు

అక్క, బావ పిదప
    నల్లారు ముద్దుగా,

సొంతపిల్లలాగ జూచుకొనిరి;
తమకు పిల్ల లేల?
తలిదండ్రు లే, తా
మటంచు పెంచినారు, మంచివారు.

చాకి, సంతరించి
చదువు చెప్పించిన
బావ మెద్దు పొడిచి పోవగానె,
అక్క గడ్డిమోపు
లమ్మి పోషించెను
లేమియేమి సేయు ప్రేమయున్న?

మగవాడు పోయెనే యని
పొగలుచు గంపంత దిగులు పొడుచుచునున్నన్;
మిగులో సగులో తాదిని,
తెగించి చెల్లెలిని సాకె దేవమ్మొకతే

అక్క దేవమ్మ దేవత!
చిక్కులెన్ని నొక్కుచున్నను.
చెల్లెలి జిక్కనీక.
మిక్కుటమ్మగు మక్కువ
రెక్కవట్టి నడుపుకొని వచ్చె
తక్కువన్నదియె లేక.

పేదరాలు గనుక,
పేదకుటుంబము చిదికి
నిలిచినట్టి చిన్నవాని.
వెదకి వెదకి,
కడకు వీని రంగన్నను జూచి
పిల్లనిచ్చి చొక్కి పోయె.

గంగమ్మకు రంగన్నకు
సింగారము జేసి, పెండ్లి చేసిననా, డా
యంగనకన్నులన్, మాలిమి
పొంగులు రంగులను సూపి పూర్ణత నందెన్.

మాలిమి తాళిమిన్
గొలుచు మానము లేదు;
కులాద్రులం ధళం ధాలిచి,
సప్తసాగర వితానము నీదుచు
కల్పముల్ తపఃపాలన సేయనీ,
ఎడద బాకుల పోటుల బ్రువ్వనీ—
వసంతాల, వనాల,
పూల పవనాల
విలాస విహారమే యగున్.

పెనుబలము గలది మక్కువ
తనుద్వాన్తె తన్నుదాను తఱుగు
కొనుటకున్
వెనుదీయనీదు, నిన్నెం
తె నిరామయ దివ్యకర్మ నిష్ఠుని జేయన్.

అనురాగ హీన జీవిత
మనయము నిన్నడచి పుచ్చు నతిభారమ్మై
నిను నన్ను చేయిగలిపి, ఆ
వని మాఘువనిన్ బొనర్చు వలతి యదొ కటే.

రంగన్న గంగమ్మ
రంగుర క్తిమలు
రంగన్న గంగమ్మ
నింగి నీలిమలు.

రంగన్న గంగమ్మ
సింగారములు జిమ్మ
రంగారు బంగారు
పొంగారు గోపురాల్.

రంగడంటే ఒక్క గంగమ్మ మగడే—
గంగమ్మ అన నొక్క రంగన్న పడుచె.
రంగన్న బ్రతుకెల్ల గంగమ్మ బ్రతుకె
గంగమ్మ మనసెల్ల రంగన్న మనసె.

రంగని గంగన్నాయని,
గంగమ రంగమ్మయనుచు గ్రామప్రజలున్
భంగుల భంగుల పిలుచుట
కంగారునె కాదు, వారి కలయిక దెలుపున్.

గంగమ్మ నలనల్ల
గాజుల రవళిలో
గంగమ్మ అఱనీలి
కన్నుల మగతలో
రంగన్న రుచిచూచు
రాగుల అంబలే
హంగైన భక్ష్యభో
జ్యాల మఱపించున్.

చూపులేగాని,
మాటలజోలిబోక ;
వలపులేగాని,
వాంఛల వంకబోక ;
పనిత్వరలెకాని
సరసాల పాలుగాక—
గబగబా ముగియించి రంగన్న వెడలె.

కొడవలి పగ్గము చేకొని
నడచెన్ రంగన్న, కొండ నడుమకు ప్రొద్దున్
గడచుచు నున్నది, రావలె
వడి వడిగా — మోపు మేత వట్టి మాటలా!

ఊరికి చేరువనే గల
దొరగ ఒకకొండ, దాని దొరువుల వెంటన్
చేరగవలెనెత్త, మ్మా
చేరువనే పెద్ద యడవి చిక్కగ నుండున్.

ఒకడా యిద్దఱ! చాలమంది,
తమకెంతో కొంత
ఆపూట జీవికకుం దోడ్పడునంచు
వత్తురు సరే!
వేయేండ్ల కొక్కొక్క వానకదా!
అక్కడమాత్ర మెట్లు గఱ కైనా పుట్టు?
ఏ పాతచెట్లకుగానీ చివురేది?
పచ్చనలు తాటల్ దీసినా చూడమే?

చినుకులు పడనే పడితే
అనుమానము లేదు గ్రామమంతా సాకున్
వెనుదీయదుముల! కావల
సిని వన్నియు నడవిలోన చిక్కును సుమ్మా.

కానీ యెపుడో, ఎచటో
నానుపు వానైన పడిననాళ్ళఁ, గొండల్
వేనలి విరియఁ, మిన్నుల
చానవలెఁ గానబడును ఛాయలు దేలుఁ.

కాసేపు రాల్చిన గంపల కొలదిగా
        కమ్మని కలివిపం డ్లమ్మవచ్చు ;
కొంతసేపే చాలు కొల్లలు కొల్లలు
        బలుసకాయలు గంప బట్టవచ్చు ;
ఇంతసేపే చాలు నెన్నైన రేణగా
        యలు కోసుకొని అమ్మనైనవచ్చు ;
ఒక యింతసేపు నోపిక గోసుకొన్నచాల్
        సీమచింతలు వడి జేర్చవచ్చు—

వీని యాదరువున
        ఊరిలోని పేద
చాన లెందఱో,
        ఆనాటి సారమునకు
చాలినంత గడింతు
        రా కాలమందు
కాయకసురుల కేమి !
        చాలాయె దొరకు.

తిండికి చాలని కక్కుఱితిం
డాపల వెలుపలనక
తేప తేప కొట్టండసిలెను
చిక్కని కొండ యడవి
అగ్గిపడుట కొంత నశించెన్.

తేనె తెట్టెలతో చాలు
తెలిసియున్న చాల
సాధించవచ్చు;
నచ్చుటి రకాల ఆకులే చాలు
కొందఱి ఆకలణచు;
ఊసులే తీర్చు
కొందఱి పీకులాట.

మడక మొదలు
కాడి మానుదాకా,
గొఱ్ఱుతుంట మొదలు
మేడితోకదనుక,
బండి కుండ మొదలు
బారు నగలదాక —
కొండలోనె
దెచ్చుకొనగ వలయు.

కాని, ఇవన్నీ— పేదల
నోనాడిన పెద్దవారి నోటవడియె, నిం
కే నాయము సెల్లదు, నీ
వా నాయనగారి శరణమనుటే తప్పక.

కావలివారి కన్నుగవ గప్పి,
ఒకప్పుడు పట్టుకొన్న
నే పావలో అడ్డగో
వదలు పట్టు నెఱింగి,
మఱింత తప్పిరక
చావడిలోని కీడ్చుకొని చన్న
సరే అనుకొన్న వారె
ఏదో విధిలేక పోదు,
రదియుక కొడవంటిని
దోచు నెప్పుడో.

కానీ తప్పనిసరియై
ఈనాటికి గూడ కొందఱల్లే వీడుక
కానకు బోవును, చుట్టఱే
కానికి దాయాది తాను గ్రామస్థులరుక.

గడ్డిమోపు దెచ్చు,
కాకున్న గట్టెలమోపు దెచ్చు,

నదియు నోపకున్న—
మొద్దుకొట్టి తెచ్చి
మునియప్ప కమ్మను,
''మడకొ బడకొ ఏదొ
మిడుకు'' మనుచు,

పొలము పనిలేని
రోజులప్పుడు తనెట్లొ
బ్రదుకవలె మఱి!
కూలికి ప్రాలుమాలి
కాదు; పనియేది?
ఏడాదికంత కొక్క—
మూడు నెలలే పనుల్
కడముట్టు నెట్లు?

దొరికిన గడ్డీ గాదము
బరబర కోసుకొని
గోగు పగ్గము బిగియిం
చి, రయమ్మున నడి ప్రొద్దున
విరవిర లాడుచును వచ్చి
వేసెన్ మోపున్.

ఎఱ్ఱ యెండ ప్రొద్దు;
ఏడు మూరల గడ్డిమోపు మెడలపైన;
మూడుమట్ల లోతు కనులు;
పొట్టలో వీపు జేరెను—
వగడు వోలె నతడు
వణకు చుండె.

ఆ నిమిష మతని జూచిన
ఏ నరమానవుని గుండెయే యయినన్, లో
కానికి శాపమిదేమని,
వేనోళ్ళను విచ్చి యేడ్చి విఱవిఱలాడున్.

గిరగిర కన్నుల నీరుం
దిరుగగ, గంగమ్మ చెఱగు దీసి యొత్తుచున్
చరచర లోనికి వెళ్ళెను
పురుషుడు తనకంటి నీరు పోల్చు నటంచున్.

మగడు కొండకు బోయిన
మరు నిముసమె
గబగబా లేచి గంగమ్మ
గవిని వారి

వడ్ల దంపకమున
　　　దనవంతు, తవ్వ
ముగ్గు చెన్నంగి వడ్లు
　　　ముమ్మారు జేసి—

చేట నారబెట్టి.
　　　బాటమీఁదే యున్న
చక్క రోటిలోన
　　　చక్కదంచి,
కుండ యెసరు వెట్టి
　　　కుతకుత మనిపించి.
చింతకాయ దంచి,
　　　పొంత నింపె.

పొంతనీళ్ళు దెచ్చి,
రవంత వంగి నిలుచుకొన్న
రంగన్న పైనిమిరి, నిమిరి
కడగుచున్న
ఆ యిల్లాలి కరయుగమ్ము—
వేయి సంజీవనుల
మేళవింపు సుమ్ము.

ఆ నిర్మల ప్రేమ
హస్త సంస్పర్శతో
మానిపోయిన వేమొ
వాని గాయములు;
లోని ఒక్కొక యెముక
హూనమై యున్న
వాని తీపులు కొంత
వదిలినట్లయ్యె.

ఇన్ని యిడుములు
నీకోసమే భరించుచుంటినని
ఆతడనడు;
నీ సుఖము కొఱకె
బ్రదుకుచుంటి నటంచు
ఆమె పలుక దెపుడు;
మాట లేటికి
మనసులో మరులు పొరల ?

అతని యడుగుల చప్పుడే
ఆమె మొగము నింత విప్పార్చు.
మాట రవంత విన్నజాలు

కన్నులలో వసంతాలు విరియు
చూసెనా యిక—
నిలువెల్ల చొక్కిపోవు.

మూడు నాలుగు మాటలే
మూడువేల ప్రేమ గీతాలు!
ఆవేగ సీమ దాటు,
హృదయములె
మాటలాడుకో మొదలు వెట్ట
నాల్క నటునిటు
కదలించు నాథు డెవడు?

చూపులతోనే వలపుల
రూపు దిద్దుకొనుచు,
అ పడంతి బువ్వబెట్టె
దాపున గూర్చొనుచు.

ఇది మూడవ వర్గ

## నాల్గవ సర్గ

గబగబ బువ్వన్
నాలుగు కబళమ్ములు మ్రింగి,
రెడ్డిగారింటికి
రోజు బరాతము రాగా
కడవ బుజానం బెట్టి
ఊరబావికి వెడలెన్.

పోటు కడవ :
గుండెపోటు వచ్చును
నింపి యెత్తుకొన్న మాత్ర ;
ఇంక నేడు మట్ల లోతునుంచి
మెట్ల నెక్కుటయున్న,
నెంత కండయున్న, నేమి చాలు :

ఎన్ని కడవలు పోసిన
నెంత పెద్ద హౌతుఖానాయొ కాని,
పైకైన రావు ;
అన్ని నీళ్ళేమి సేతురో ఉన్నవారు ;
పాపము :

ఆ రంగనికి బోధ పడనె పడదు.

మాటయేగాని వీరిచ్చు మాట లేదు ;
ఏటి పట్టెల పాలన్న దాటిపోయె,
పూట కొక ముంత మజ్జిగ బోతు రంతె—
పేదవాని కదే అమృతోదనంబు.

కూరనార వాని పేరైన తెలియదు
మెరపకాయ కంటె దొరకదేమి
ఉల్లగడ్డముక్క, చల్ల —
ఇవొక్కటే
సాదమందు,
వారి సాధకములు.

దేవళాలు తిరుగగానె
బావి సేవ మొదలు ;
దోవ అఱిగిపోయి, గుండె
చేవ దప్పి వఱకు.

మఱి యిరస వడ్లు, రోకలి
దరిసెనమయ్యెన్ ; సరే
ఎదల్ పగులగ
నా వరుస ముగించెదు సరి
క స్తరవిప్రభ
ఊరి నెత్తురి సంద్రము జేసెన్.

లాందరాలు తుడిచి.
లాంపులు ముట్టించి,
మిద్దెమీద వరుస మిగులకుండ
మంచములను వేసి,
మనిషెత్తు పరుపులు
దులిపి, పఱచి, దోమతెఱల గట్టి.

ఈ యింట నున్నంతసేపు—
కోయన్న కోటి సామాను ;
ఈ యిల్లు దాటితేనేమొ—
రాయెత్తితే రాయి నీను.

ఈ యింట నేమూలనైన
చేయి వెట్టిన రాల్ వరాలు ;
ఈ యిల్లు దాటితేనేమొ
వేయంచులన్ దెగు నరాలు :

ఈ యింట నేపెట్టనైన
ఈ యూరి సిరులెల్ల పూచు.
ఈ యిల్లు దాటి పారాడ
ఈ యూరి కడగండ్లు వేచు.

ఈ యింటిలో తొంగిచూడ
ఈ యూరి చెమట నీరాడు ;

ఈ యూరిలో తొంగిచూడ
ఈ యింటి భూతమ్ము నీడ.

ఈ యింట చలువబా
లిమిడిచి చెక్కిన
నేలపై నీనీడ
వాలుదోచు ;

ఈ యింట నున్నట్టి
యిటుక గోడల, పాల
గారలో అద్దాలు
కలసి పోవు ;
ఈ యింటి మహాడీల
నెక్కిన చానల
వేనలిలో మబ్బు
సోనలూరు ;
ఈ యింట దిరుగాడు
నింతపిల్లియు, నూరి
పెద్ద రైతుల
నిలవేయ జాలు —

ఇచట తేన్నెప్పలెకాని విన్పింప వూర్పులు—
ఇచట దూకల గల గల లెత్తిపోవు ;

ఇచట లక్ష్మి సరస్వతులే వసింతురు—
ఇచట లేనిది — మానవ హృదయ మొకటె.

ఈ యింటి యజమాని
ఎంతో విద్యావంతు
డెపుడు భాగవతమ్ము
నే పఠించు;
ఈ యింటి యిల్లాలు
పూయించు గన్నుల
కొల్లలు కొల్లలు
మల్లెపూలు;
ఈ యింటి కొడుకొక్క
డింగ్లాండులో, ప్రజా
స్వామ్య శోధన నెంతో
జరిపి వచ్చె;

ఈ యింటి కూతురు
పోయిన యేడె,
సాంఘిక శాస్త్రమున
పట్ట మొకటి గొనియె;
ఎచట జూచిన చిత్రాలు
నెన్నొ శిల్ప ఖండములు గనిపించు,

నెక్కడను మలిన మన్న దే లేదు—
కాని, సంపన్న గృహము
చొచ్చి చూచిన
నాత్మయే
శూన్య మిచట.

మున్నూరు మట్టి మిద్దెల
కొన్నెత్తములెల్ల దీని కొత్త యరుగులం
దన్నగ లే విది యొకటే
ఉన్నది ఊరెల్ల మ్రింగి యుబ్బినట్లుగ౯.

కోటి కొక్క రిది ఇ
చ్చోటి రాయలసీమ;
పేట కొక్కడ లేని
పెద్ద రాయలసీమ;
వేటాడి వేటాడి
వెదకినా ఇందులో
నేటి పేదల సీమ
నిజరూపు కనబడదు.

ఇది ఎడారిలోని ఒయాసిస్సే కానివ్వ
వడగొట్టిన పేదకేమొ వట్టి ఎండమావు.

ఇంత ధనమున్న
చదువున్న.
నింత బలగమున్న
నీయింట నెవరికి సున్న హాయి;
ఒక్కొకరు నొక్క లోకము—
ఒక్కరి దొకొక్క తీరు—
నెయ్యమ్ము లిచట
ప్రిదెనుగులయ్యె,

ప్రొద్దు పోకకె చదువు
ప్రొద్దు పోకకె నలివు
ప్రొద్దు పోకకె మెదుకు
ప్రొద్దు పోకకె బ్రతుకు.
మొద్దు వాఱెను మనసు,
మొద్దు వాఱెను తనువు
మొద్దు వాఱెను, బ్రిదుకు
సుద్దియే యిచట—

ఎటు చూచినా
ప్రక్క లెండి యున్నారు
ఎటు చూచినా
విలాపించు చున్నారు

ఎటు చూడలేక
	తమ కిటికీలు మూసుకొని
కటు జీవిత —
	యథార్థ కథ చూడకున్నారు.

చుట్టుం జుట్టు
దరిద్రతా విధుర సంక్షుబ్ధ క్షుదంబోధిపై
తెట్టుంగట్టు నురుంగు కొంపయిది,
బోదెల్ పాదులుఁ గుళ్ళై;
నీ పుట్టిఁ మోసెడువారు పీన్గులయి
రేపోమాపో చానుండ
వీ రెట్టుఁ నిల్వరు, చూచుకోరు దరులు—
అల్లే చుక్కలఁ జూచుచుఁ,

దారుణ కల్మష
	దగ్ధ మారుతో
ధ్మాన రోదసీ
	క్షుద్ర భూమిపై,
ఘోర నారక
	క్రూర జ్వాలా
ఘూర్ణమాన సం
	చూర్ణమాన, బా

ధాధరా ధరా
ధిత్యకపై, జం
బూక రోదనా
పూర్ణ శ్మశాన
కాష్ఠచ్యుతాస్థి
కా శిఖరముపై,
ఎట్లు నిలుచు నీ
కృత్రిమలోక,
మ్మెట్లు నిలుచు నీ
కృత్రిమ జీవ
మ్మెట్లు నిలుచు నీ
కృత్రిమ హృదయ
మ్మెట్టెట్లే చిట్లి
పెట్లి పోవును.

పరిసరాలు దరిద్రతా
పరిదగ్ధము కాగా,
సరి నరాళి నసరాలన్ని
పురుగుబట్టి పోగా,

ఉరికి ఆర్పలేక పురుగు
తరిమి వేయలేకా
ఉరిమి చూచుచుంటి వట్టి
దరి జేసితనమ్మ.

ఎచటికో పోవుచుండి,
కాసింత సేపు
ఆగియున్నట్టు లుండు రీ
ఆస్తి పరులు,
పలుకరించ రెవ్వారి
సంజ్ఞల వెలార్చి
ఉత్తరువు లిత్తు రంతియే
ఊడిగముల.

ఇంటి ముసలమ్మ మాత్ర
మా వెంట దరిని
కుక్క మంచమ్ములో, పండు
కొని, ఒకపుడు
రంగనిం బిల్చి మాటాడు
పొంగి పోయి

వీని నాన్న నెఱింగిన
వెఱ్ఱి దామె.

పని ముగించి రంగ
డనుదిన వర్తన
పుల్లగూర కొంత చల్ల కొంత
తీసుకొని, రవంత
తేఱపి వచ్చెనటంచు
ఇంటి ముఖముపట్టె నిట్టిపోలె.

మాటు మణిగిన దూరు,
నిర్మానుషములు దారులన్నియు
చాకలి గేరిలోన మటుకు
మగని గుద్దులుతిన్న మల్లి యేడ్పు—
ఊరకుక్కలు మాత్రమే
ఊరడింప.

చీకటి ముంచివేసినది
చింతల పల్లెను ;
గుట్ట కొంప ముందే ; కడలేని బాలు—;
అడుగు తీసి ఒకించుక

ముందు వేయుచే
నాకము నెక్క నంతపని !
నాలుగు బారల కొక్క గుంతొ మిట్టొ
కనిపించు ;
వాడుక నెటొ నడువర్ వలె
మెల్ల మెల్లగన్.

గూటిలో దీపముం బెట్టి,
నోటిలోన
కబళముల బెట్టుకొందురు
గ్రామజనులు !
అంత చుక్కల వెలుతురే
యైన జాలు
వారి కనులకు గనిపించు
వస్తుతతులు.

అసలు దీపము ముట్టించు
నంగణములె
చాల తక్కువ ;
ఉన్న దీపాలుగూడ.

తమ్ముదాము
జూపించుకో దగిన జాలు
అన్ని వస్తువుల౯
జూపినంత ఫలము.

ఒక్క కోమటి సుంకన్న.
ఒక్క బట్ట లచ్చుమయ్య,
పంచాంగము రామశాస్త్రి
ఒక సరాబు వీరాచారి,
ఒక్క భజన గురువు—
—వీరిండ్ల లోననే
ఉరువు దివ్వె.

ఊరి ముందట
కరణముగారి విడిది;
ఊరి కాదట
రెడ్డిగా రున్న మేడ;
ఉన్నవని తోచు రాత్రులు;
నూరు మొత్త
మంధ కారాంతరమ్ములో
నావులింప.

వేకటి చీకటి, ఆకటి
కూకటి పిరియించి రాత్రి
గుబగుబ లాడున్.
మూకటి పగిలిన బ్రదుకులు
రోకటి మనుగడలు మాత్ర
రొప్పుచు నాడున్.

అక్కడక్కడ
నొక్కొక్క ప్రక్క సందు మోటులో.
మాటులో.
తెప్పపాటు నిలిచి——
మోటు జీవాల
తొందరపాటు గన్న
నేటి బ్రదు కిదియని
ఏవగింపు గల్గు.

దయ్యమ్ము వోలె చీకటి
గొయ్యని ముసుగుం దగుల్చుకొని, ఒక్కండా
వయ్యారి బసివి గొట్టము
కొయ్యం గదలించె, కుక్క కొయ్యో యనియెన్.

వామి దొడ్లలోన
        దోమల గుంపులో
పాముపుట్ట ప్రక్క
        పండుకొన్న
పసల పిల్లవాడు
        భయపడి, ఎనుముల
ప్రక్క జేరి, తోక
        బట్టుకొనియె.

దుబ్బ నాగిరెడ్డి
        దూడ రాలేదని
వెదకబోయె, దొరువు
        పొదలలోన ;
గూని సుంకిరెడ్డి
        గొడ్డు, బందెల దొడ్డి
లోన పడినదన్న
        మాఱినువడియె.

రచ్చకట్ట మీద
        రామన్న సుబ్బన్న
వలపు తప్పదనుచు
        వంతపడిరి ;

బోయ చిన్నిగాడు,
బోరుగుల రంగమ్మ
అప్పు పెట్టదనుచు
నఱచు చుండె.

సుంకలమ్మ, పసుల
చొప్పదీయుచు నుండ,
తేలుగుట్టె నెడమ
కాలిమీద ;
మంతరించమనుచు
మరియప్ప దఱికేగ,
గొఱ్ఱె చచ్చి వాడు
గోఃఖగుచుండె.

సంతలోన సరుకు
దొంతర నెత్తించి
బండిలోన వచ్చు
బద్దరయ్య
వల్ల లేని యెద్దు
వాటు వేసిన గొంతు
చించుకొనుచు నుండె
చెడితి ననుచు.

సందుమూల గుంపు ;
కందిరీగల వోలె తిరుగుచున్న వారు ,
బరువు గొంతు ;
కడుపు తఱుగు నేడ్పు,
కళవళపాటులు—
రంగ డేమి టనుచు తొంగిచూచె;

ముసలి దేహము మంచముం బడి మూడేండ్లు
రాత్రి గడప దనెను రామదాసు
ఇంటి మనిషి నాగి ఈరోజు కన్నది
ఆకు దేను బోయెనంట వాడు.

పురుగు కుట్టెనంట ;
నరసన్న నోటిలో నురుగు వచ్చుచుండె ।
సొరుగువచ్చె ;
నోటి కొక్క మాట ;
బాట పల్లెకు వెళ్ళి ;
మంత్రిగాని దెచ్చు మార్గమేది ?

రొమ్ము గొట్టు కొనుచు
రోదించు నాగిని ;
వట్టి మాటలాడు
వారి జూచి;

నేను పోయి మంత్రగాని
దెత్తు నటంచు
ముంత నచటబెట్టి
పొంత బట్టె.

"పాము గఱచెను,
నే డమావాస్య గూడ,
కష్టమే" నని రామయ్య
కట్టమీద గూరుచుండి

అనెన్ పోవువారితోడ,
ఆకుమాటలో నున్న
పొగాకు దీసి.

మాలపున్నమైన
మరుసనాడే కదా
పాము గఱచి చచ్చె
రాముడనుచు,
సాలె నారణమ్మ,
చాల విచారించి
కట్లపాడిని నోట
గలుపుకొనియె.

రంగ డొక్కొక్కటే విని
          రగులు కొనుచు
చెంగు నెగజెక్కి,
          బర్రైన చేత లేక,
ఆ తమోగర్భమున బడి
          అరుగుచుండె
భయము తోచదు కర్తవ్య భారమున్న.

కన్ను పొడుచుకొన్న
          కనరాని చీకటి
పురుగుపుట్ర యిచట
          పుట్లకొలది ;
అసలువాడు, దారి
          నైన చూచుట లేదు
కలదు దృష్టి
          మంత్రగాని మీదె.

గుండెతీసిన బంటైన
కొండదోవ, కనుమదాటి.
చీకటిపడి చనుటయన్న
ఒప్పుకొన లేదు ;

కాని, ఆ ముప్పు జూచి
తప్పుకొన లేదు
రంగని గొప్ప మనసు.

కళ్ళలోన మెదలు
గంగమ్మ సంగతే తట్ట లేదు ;
రంగడుట్టిపాటు పయనమయ్యె
రెండు పరువుల పల్లెకు ;
ఎద కరంగునప్పు డేది నిలుచు.

ఊరు మండిపోవుచున్న సరే !
రెడ్డిగారి మేడమీద
భారతమ్ము,
రాగళయ్యతో పురాణమ్ము సెప్పును
రామశాస్త్రిగారు
రాత్రి రాత్రి.

ఊరిబయటకు వినిపించుచుండె
నతని పెద్ద గొంతుక.
ఊరెల్ల దద్దరిల్ల ;
''తనకు తోడయి వచ్చును ధర్మమొండె''
అన్నమాట ఒక్కటె
కొండ అనువదించె.

ఇది నాల్గవ సర్గ

## ఐదవ సర్గ

ఆంబటి వా
రటుకులు దంచం బిలిచిన వల్లెయని
బ్రసాపడి
మధ్యాహ్నంబే రంగమ్మ చనెన్
కంబము బోల్
రోకలొకటి గైకొని వేగన్.

అటుకుల దంపకమ్మన
మహాశ్రమ దాయకము—
అగ్గిరేగు గుప్పిట.
ఉడికించి వడ్ల, నొక పెద్ద పెనమ్మున వేసి
రోటిలో పిటపిటలాడ దంచవలె;
పీకల మీదుగనుండు;
నల్గు రొక్కటి తరువాత నొక్కటి
చకాచక పోటులు వేయుగావలెన్.

చేతులు బొబ్బలెక్క,
నలసెన్ బదముల్, దగవుచె
గుండెలున్ కూతలువెట్టె,
రక్తము రగుల్కొనె.

ముక్కుల నూపిరాడు లే
మోఁతగనుండె,
కన్ను లర మోడ్పులకుం దగవయ్యె.
తెప్పపాటే తడవైన
రోఁకలి పెఠిల్లను,
రెక్క శఠించు ఠక్కునన్.

చేయి మార్చి మార్చి
చేతి కోలది దంచె
ఒక్క క్షణము గూఁడ
నూఁర కోనక ;
మూఁడు పెనములందు
మూలుగు ధాన్యము
వరుస మీఁద వరుస
వచ్చుచుండె.

నిప్పు చెఱుగు నెండ । దుప్పటే పైకప్పు
మూఁడు పొత్రివ్వులందు । మొద్దుమంట
వాయిమీఁద వాయి । వడి దంపక యింక
చెప్పనేల వారి । తిప్పలంత !

నలుగురిలోకల్లా
గంగులు చిన్నది, దూడపిల్ల
కోమలమ్ముగా
కలకలలాడుచునున్నది—
విలవిలలాడెన్
పెనాన పేలగింజమై.

దగవుట్టుచున్నదని
వేరుగనిలిచిన, తోడివారు
రుంజుకొందురన్ దిగులున
నెట్లో పండ్లన్ బిగబట్టి,
కరమ్ము నెత్తి
బిరబిర దంచెఁ.

అందులో నొక్క
పెద్ద ముత్తైదు వీమె
తన కలాటనుజూచి జాలిని వహించి,
'అలత దీర్చుకోవే పిల్ల!' అనెనుగాని
బింకమున దంచుచున్నది
పెద్ద ప్రొద్దు.

ప్రొద్దు మునింగెగాని పని పూరితిగాదు ;
ఒడలున్ వశమ్ములో కద్దని చెప్ప లేము ;
తనకంటె బలమ్ము జవమ్ము గల్గువా,
రద్దరి యెండుటాకులటు
లల్లలనాడగ !
నేవళమ్ముగా
సుద్దుల ముద్దులం బెరుగుచుండిన
తానిక ఓపగల్గునా ?

'ముంతెడు గింజలైన
మన భుక్తికి జాలును ;
నేను దెత్తునా యింత ;
రవంత పై పనులనే

సరిపోవును వెచ్చ ;
మింతలో నంతకు నింతకున్
బరువులైన పనుల్ తలవేసుకోకు,
మంచెంతగ మామ జెప్పిన,
తనే వినదాతని తోడునీడయై.

మామ మాత్ర
మూరక క్షణమాత్ర ముండ లేడు గద ;
కోడితో లేచి,

వాడవాడ మాటు మణిగిన దాక
చెమ్మటల నోడ్చుచుంట జూచి
తనెట్లు కూర్చుండ గలదు !

నల్తుము వద్దు పెండ్లికని
నాగుకు తెచ్చిన వల్లె యుండె ;
కుప్ప త్తను గొట్టి తెచ్చినది
వల్లెకు చీరకు చాలదయ్యె ;
ఆ కొత్తల కూలి
కొట్టమునకుఁ సరిపోవనిదయ్యె ;
ఇంక తాన త్త యటంచు
నెట్టులను నాయమ
మామ యవస్థ జూచుచున్.

దాపటీకమ్ము లేదు,
తను దానయి చిక్కుల నన్ని జెప్పు.
చూపోపమి నేరు దప్పిన
నెదో ఒక చీర ఉగాదినాడు,
తానే పనిమీద వెళ్ళినటులే చని
తీసుక వచ్చు ;
కంటిలో పాపగ తన్ను జూచు ;
తన పాలిటి దేవుడు మామ యింతకున్.

తానయి చేతనైన పని
తప్పక సేయదలంచె గంగులు,
ఆపైన, ఒకొ్కక్కనాడు
తన ప్రాణము సొంపకయున్న
లోనలోనే నలతన్ బిగించుక
పనిఁ విడనాడదు ;
మూడు పొద్దులుఁ
లేనివి ఉన్నవేవి కదలింపక
బువ్వను బెట్టు మామకుఁ.

తన కేమో నెలనుండి పై దిరుగు
పొంతంబట్టి నిల్చుండి పోయెనుగానీ—
పదినాళ్ళనాడు తన కేమేమయ్యెనో ;
కండ్లు లేవన చీకట్లు గ్రసించె కొట్టము ;
శిరోభారమ్ముతో పొద్దుగ్రుంకినదాకా
పడియుండె ;
నద్దది మొదల్
గీపెట్టు కర్ణమ్ములున్.
సందకాడ జొన్న
    సంగటి గెలకంగ
తెడ్డు చూరినుండి
    తీయుచుండ,

మసక గ్రిమ్మి పొయ్యి
 మంటలో పడబోయి
మల్లి, పట్టుకొనగ
 మనిషి దక్కె.

మడికలుపు లప్పా డిల్లీ
తడిపచ్చిక గోసి,
 మోపు తలనిడి తెచ్చెన్ ;
తడికకు మోపానించుచు
పడిపోయెను,
 సుంకులమ్మ ప్రాణము నిలిపెన్.

నిమ్మకాయ బొప్పి,
నెమలీక, జీలకఱ్ఱయును
తేనె రంగళించి
నాకు మనెను ;
దాన నాల్నాళ్లు బాగుండె ;
బొట్టులేక తేనె పుట్టదిపుడు,

మొన్నరాత్రి,
కడుపు సన్నసన్నగ జొచ్చి,
తెల్లవారుజాముకల్ల హెచ్చి
చుట్టజుట్టుకొనుచు

తట్టుకోలేక
ఎంత లపరించినదియో దైవమెఱుగు !

కానీ లేత వయస్సుది !
లోనున్న ఒకింత బలిమి రోజు రోజుకున్
కానల వట్టుచు నుండె, జ
గాన నిగారమ్ము నిగ్గు కలదె లేమిడికిన్ ?

పలు కడగండ్ల గాసిలి,
యవాంతర భేదము మ్రింగికొంచు,
నా ఎల జవరాలు
మూమ గనిపించిన పొంగులువారు
పోడుముల్ పులకలు గూర్ప,
నన్ని వగపుల్ బొయివెట్టి
శ్రమించుకొంచు,
రోజులు గమియించుచుండె
తల సూపెడు కోర్కులు
తీవ సాగగన్.

తానొకనాడు, సందు మొన
తక్కువలో
నొక మట్టి మిద్దెనో దేనినో
వేసుకోవలె !

పదింబది రెక్కల వంచి యెట్లొ
బాకీని తెగించి తీర్చవలె ;
కేరుచు త్రుళ్ళుచు నుండు పాపని
తానయి మామ కిచ్చి.
సులతానువు ! నీవని
చెప్పగావలెన్.

ఈ మాట దోచినపుడా
కోమలి చెక్కులను బూసె కుంకుమ పూవుల్
గోముగ మోమిడి మామను
మామూలిమ్మనుచు నడుగ మానసమయ్యెన్.

తటుకున దోచె
నా పగ లతండొక యించుక తల్లడిల్లి.
వేసటపడి, తొందరన్
కొలది సాదముతో జనె
బావి సేవకన్
గటుతర భావము ;
ఆ ముగుద కాల్వడకేన్,
మెయి చెమ్మటించె.
నొక్కట కనుచీకటుల్
తలమొగన్
సుడిగాలిని దేపె గిఱ్ఱునన్.

'పడె పడె' నంచు నందఱు
గబాలున చేతులనున్న
వచ్చలె దడ దడ వేసి, చుట్టుకొని,
'దయ్యము వట్టిన దేమొ?
వాత మొక్కడ గనిపించె నేమొ?
వెనుకే గలదేమొకొ మూర్ఛ?
కుప్పగా బడు పసిపిల్ల లుందురె?
విపర్యయ మియ్యో' దటంచు నెంచుచున్.

మొగమున నీరుగొట్టి
పదముల్, కరముల్, ముఖంబ
మంత చల్లగ గనిపించినన్
బసపు, రాగుల పిండియు రుద్ది,
వేడిగంజి గుటక వేయనిచ్చి,
మతి జేకుఱునంతకు వీచి వీచి
కన్నుగవను విచ్చినన్
మనసు నూఱట జెంద
అనంత తృప్తితో.

ఇరు ప్రక్కల నిద్దఱుగా
తరుణిం బట్టుకొని,
సందు దాటించుక వచ్చిరి
కొట్టపుగ్గనకు—

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R. NARLA
D.P.R.I.
Acc. No.

Acc No. 10322

అక్కడ పురులెక్కిన చీకటుల్
గుబుల్కొనుచుండెన్.

ప్రమిద, వత్తి, ఆముదము, నగ్గిపుల్ల
నొక్కొక్క రొకటి తెచ్చి,
గూడు దెలిచి,
ఈతచాప వేసి ఎటో
పడుకోన బెట్టి
వారి పనులమీద వారు చనిరి.

అంతకంటె
వార లందింపగల సాయ
మేమి గలదు ?
చేత నేమి లేని పుట్టు పేదవారు
పొలతులందఱు పాప ?
మైన నేమి హృదయ మంత మృదువు ;

పొరలుచున్న దామె చిఱుచాపపై బడి
తెఱలు తెఱలు పొరల తెరలు గ్రమ్మ,
కనుల నీరు లురల నును చెక్కు లదరగా
ఎఱుక మఱపు దారి యిఱుకులందు.

కొంత సేపటి
కొక కొంత కోలుకొనుచు,

తడక చప్పుడు కాగ
రంగడని తోచి
ముంచుకొని వచ్చు దుఃఖమ్ము
మూతవెట్టబోయి,
బిగ్గఱగా నేడ్చివేయసాగె.

పిల్లికూన బెదరి చల్ల ముంతను ద్రోసె
మామ కెట్టు లనుచు నామె లేచె;
చెవులు గింగురనియె, చేతు లాన్చగ లేక
విసురుకొనుచు బోయి పసరు గ్రక్కె.

రంగన్న వచ్చె, బారెడు
నంగలతో తడకలాగి యవలకు ద్రోసెన్.

గంగమ్మ దుర్గతిం గని,
చెంగున చేతులను నెత్తి చేటిచె చాపన్.

ఏమి జరిగినదో!
తనకేమి బోధపడుటయే లేదు!
తనగొంతు పలుకలేదు
అల్లె నిర్విణ్ణుడై
గంగులమ్మ తలను
తొడపయిం బెట్టుకొని
గ్రుడ్లు విడుచుచుండె.

ఒక్కచేత నామె చెక్కిలి నిమురుచు,
నొక్కచేత తలను నొక్కిపట్టి.
తేమ లేని గొంతు తెమలక,
తాకిడి మాటలాడు నేమొ
మమత నతడు!

ఆ చెయిసోకి,
గంగమ హృదంతర మందలి జీవనాడి
ఏదో చలియించె;
కన్నుగవ దోవలు విచ్చె;
కడింది మక్కువల్
పూచిన మొగ్గవోలె
తనువుఁ వడ దేర్చెను;
మానసాంతరాశాచిర దీర్ఘ కాపతిత
కైవల జాల మొకింత తొట్రిలెఁ.

కమలిన కన్నులన్ విరిసె
కమ్మని జీవలతాంత వాసనల్;
బ్రమసిన గుండెలోని
పరువమ్ముల గింజలు మోసులెత్తె;
నే యెముకలలోనికో
కలిసి యేగిన నెత్తుటిచాయ
మేనిపై గమగమలాడఁజొచ్చె;

తమకముల కమ్ముల
నీనె నూరుపుల్.

ఆ క్షణమందు రంగడు.
సమాధి గతుండగు యోగివోలె
నే అక్షర నిత్య సత్య
మధురాంతర భూమిక చెంత నిల్చి.
చిత్తక్షయ లక్ష్య సిద్ధి
గను దార్పుల, నూర్పుల జిక్కవట్టి
ప్రత్యక్ష పరాత్పరత్వ
చరమావధిలోన లయించు చుండెనో!

గంగమ మామా! యని. బి
గ్గం గౌగిలి హత్తి గుండె గంటలు మ్రోయగ్
నింగి నరుంధతి కన్నుం
జెంగలువల నీరుగ్రమ్మ చెక్కుల నిమిరెన్.

రంగడు పిల్లా; యని, బి
గ్గం గౌగిలి హత్తి గుండె కన్నుల పూయన్,
నింగి పురూరవు కన్నుగ్
జెంగలువల నీరు గ్రమ్మ చెక్కుల నిమిరెగ్,

కొక్కొరొకో।
అటంచు నదిగో!

బరువెక్కిన గొంతునెత్తి,
కొమ్మెక్కి, ఒకేంత కొప్పు గదలించుచు
అెక్కల నార్చుకొంచు.
నీదిక్కయి కోడికూసినది ;
ఇదే ప్రణవమ్ము,
దరిద్రమానవాస్రుక్కణ హోమ
మంత్రమున,
కింక మొదల్ మఱి నిన్నచావులే :

నిన్నయే నేడు వీరికి ;
నేటివలెనె రేపు వచ్చును —
గుండెల నూపివదలు ;
మాపులే రేపులైన
ఈ మాయ వదలు
రేపకడ కోసమే
వీరి యీ ప్రతీక్ష ।

కండలుగోసి, పాళ్ళిడి
బికారుల జేసి
జనాల నెత్తురుల్ పిండుచు,
కుక్క కూడయిన బెట్టక,
పొట్టల గొట్టి
కూళలన్ దిండుల కానబెట్టి,

జగతిన్ గరుణార్ద్రిత కగ్గివెట్టు
పాషండుల వల్ల కాదు
మనసా!
యిది మానవసంఘు మెట్లగున్ ?

గుండెలుకోసి యివ్వగల కూరిమి
కొండలు మోయు తాల్మి,
కట్టెండకు నిల్చి
బండల పెకిల్లున బ్రద్దలు గొట్టి
బంగరున్ చెండుల
పైకి దీయగల చేవ.
జితించిన వీరి
కర్మ మార్తాండుల
ఆచి ఆపడు చెఱన్ గను
పాతక మేల దైవమా!

దైవమా; ఉంటివా ? చచ్చినావ నీవు ?
ధర్మమా! గెంటిరా ? నిన్ను ధరణినుంచి ?
సంఘమా; తలకెక్కెనా ? సన్ని నీకు ?
హృదయమా! మానవుడు నిన్ బహిష్కరించె

ధరణి కంపింప, కులగిరు లురలిపడగ,
మేరు శిఖరమ్ము నెక్కి, మిన్ను లదర,

చచ్చె నీలోకమున నాత్మసాక్షి యనుచు
నెత్తి నోరిడి కొట్టుకోనిండు నన్ను,

ఇదే పెన్న! ఇదే పెన్న!
నిదానించి నడు!
విదారించు నెర్ర వట్టి
ఎడారి తమ్ముడు!

ఇది అయిదవ సర్గ
సర్వం సమాప్తం.

## ప్రాంతీయములకు టిప్పణి

పాలు - కౌలు, కోరు
పరష - తిరణాల, తీర్థం
దస్రము - ప్రామిసరీ నోట్ల కట్టలు, 'పది వేల దస్రం ఉన్నవాడు' అంటే అతనికి పదివేలు బాకీ లోకులు న్నారు. పదివేలు వడ్డీకి ఇచ్చి ఉన్నవాడు అని అర్థము.
అలేకార్లు - ఉద్యోగులు, ఆఫీసర్లు
మహడీ - మేడ
దూము - కలరా
దూడవయసు - పసితనం, ప్రాయం
రూకలు - రూపాయలు
కుమ్మక్కు - ప్రోత్సాహం
ఆయకము - తనఖా
వలుపు - కలుపు
కణజం - ధాన్యంపోసేవి
పాతర - ధాన్యం నిల్వచేసే నేలమాళిగలు,
జీవాలు - గొఱ్ఱెలు, మేకలు
బొట్టు - కానీ.

V.R. NARLA MEMORIAL LIBRARY
D.P.R.I.
Acc. No.

కొట్టము- పాక.

లోటా- పంచపాత్ర, గ్లాసు, టంబ్లరు.

మిరపగింజలు- మిరియాలు.

గవినీళ్లు- కొండలో చెలిమనీళ్లు,

పిన్న పెద్ద- పెద్దమనిషి, కాలవ త్రవ్వే వారికి పెద్ద.

సిల్వరు- అల్యూమినమ్.

మడక- నాగలి-

చక్కరోలు- బజారులో ఉన్న చిన్న కట్టరోలు.

పై నిమరి- వళ్ళు రుద్ది.

పై- ఒడలు, శరీరము.

మట్లు- నిలువులు.

మెట్లు- సోపానాలు, మెట్టికలు.

జౌతుఖానా- స్నానాలగదిలో నీళ్లు నిల్వజేసేందుకు గారతో కట్టిన పెద్దతొట్టి.

మున్నూరు- మూడువందలు.

పుట్టి- చిన్న తెప్ప.

గొరి- వీధి

బసివి- బసుపురాలు, ఊరిలోని దేవదాసీ లాంటిది.

ఎనుము- గేదె,

ఆకు- కన్నప్పుడు చక్కపెడతారు, ఆకు యిస్తారు. వేడికల్గించే వ్యాధి నివారణ చేసే ఓషధి.

ఆకుమూట- పై పంచకొసన ఆకు, వక్క, పొగాకు, సున్నం వగైరాలు కట్టుకున్న మూట.

మాలపున్నమ- మహాలయ అమావాస్య.

కట్లపొడి- పొగాకు కాడలుదంచి పెటిన పొడి. ఆకు వక్కలలో కలిపి ఆడవాళ్ళెక్కువగా వేసుకుంటారు.

కనుమ- కొండదారిలో కొండదాటే యిరుకుదారి.

పరువు- రెండున్నర మైలు.

అంబటివారు- యింటిపేరు (వైశ్యులు ముఖ్యంగా).

తనకలాట- బాధ

ముంతెడు- రెండు తవ్వలు.

మామ- మగడు, ఈవర్గాలలోనే ఎక్కువగా ఈఅర్థంలో ఉపయోగిస్తారు.

నల్లుము- నాలుగు తూములు-

వల్లె- వంచ,

పై దిరుగు- వళ్ళు తిరుగుడు, కండ్లు తిరుగుడు,

పొంత- ప్రొయ్యిప్రక్కనే మంట తగులు నట్లుగా పెట్టిన బాన.

సందకాడ- సందెకడ, సాయంకాలం.

నాల్నాళ్ళు- నాలుగు రోజులు.

బాకీ- అప్పు.

మామూలు- ఇనాము, ప్రతి పండుగకో వర్షానికో ఇచ్చే బహుమతి.

## ఈ రచయితవే :

| | | |
|---|---|---|
| విరిశన్నె | కోల్హోజ్ | నేటి భారతదేశం |
| ఫాసిజం | అదీ రష్యా | నా పడమటియాత్ర |
| లెనిన్ | ఫాసిజం : దానివిధ్వంసనం | విలాసిని |
| పాపం : | రష్యా యుద్ధకథలు | పేదరాలు |
| ఏంచెయ్యడం ? | ద్వేషం | ప్రజావిరోధి |
| స్వతంత్రం | దురాక్రమణ | ప్రేమించాను |
| చెకోవ్ కథలు | ఇరాన్ | రానున్న సంక్షోభం |
| సమీక్ష | ఇండోనీషియా | మానవుడు |
| రాతలూ గీతలూ | వియత్నాం | |
| స్టాలిన్ | ఇండియా | —మొదలగునవి |

## పత్రికలో ప్రచురితమైనవి :

| | | |
|---|---|---|
| మహాశిల్పి | గోర్కీ కథలు | దశకుమారచరితం |
| సత్యం మామ | ప్రొద్దుతిరిగింది | మేఘసందేశం |
| ప్రథమ ప్రేమ | భారతీయ కవితాకల్పకం | బిల్హణీయం |
| సాహిత్యమీమాంస | నా హృదయం | విక్రమోర్వశీయం |
| కవిత్వ వివేకం | స్వస్తిశ్రీ | మత్తవిలాసం |
| ధర్మదుర్గం | మహాసంకల్ప | బాలల కథలు |
| నీడలు జాడలు | కచ దేవయాని | బాలల గేయ కథలు |
| పలువురి కథలు | భూమి | తెలుపు నలుపు |

— మొదలగునవి

BCi

AOUAL05B122

BC

# పెన్నేటి పాట

(ద్వితీయ ముద్రణ)

రచయిత

## విద్వాన్ విశ్వం



ఇది రాయలసీమ కన్నీటి పాట. ఇందులో ప్రతిఫలిస్తుంది. 'పీనుగుల పెన్న'. 'వట్టి ఎడారి'. ఆంగ్లేయుల దొరతనంలో ఎన్నివిధాల ఎండవచ్చునో అన్ని విధాల ఎండింది రాయలసీమ.

ఈ సీమ దరిద్రావస్థ, దైన్యము విశ్వంగారిలో కలిగించిన తీవ్ర నిర్వేదమే పెన్నేటి పాటగా వెలువడింది. అనుభవమే మూలాధారంగా వెలువడిన పరవశ రచన వీరిపాట. రైతుల ఆశా నిరాశలను రాయలసీమ పలుకుబళ్ళతో అభివర్ణిస్తుంది. కాపు దంపతులైన రంగడు, గంగమ్మల పరస్పరానురాగము, పరోపకారపరత, నిష్కల్మష వర్తనము, నిష్పచ్చరము కరుణ మహితంగా చిత్రించే కమనీయ రచన. పద్యగేయ సమాహారంగ వెలువడిన తొలి సమగ్రకావ్యం పెన్నేటిపాట. నవ్య కవులలో విశిష్టులు, పేను మిగిలిన పత్రికా రచయితలు—విద్వాన్ విశ్వం.

యం. శేషాచలం అండ్ కంపెని,
మచిలీపట్టణము : సికింద్రాబాదు : మద్రాసు-1

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపత్రిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B122 |
| పుస్తకం పేరు | పెన్నేటిపాట |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | yes |
| వెనుక అట్ట | yes |
| మొత్తం పేజీలు | 101 |
| పెద్ద సైజు పేజీలు | no |
| ఖాళీ పేజీలు | ei BCl |
| లేని పేజీలు | no |
| తయారు చేసినది | Methun |
| పేజీలు వరుసపెట్టినది | Methun |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు సరిచూసినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |